సాక్షి తూర్పుగోదావరి

శనివారం । 5 । ఏప్రిల్ । 2025



రాములోరి పెళ్లి సందడి

ఆంధ్రా భద్రాద్రిగా పేరొందిన జి.మామిడాడలో శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించనున్నారు.


8లో



పెట్రోలియం రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతం

పెట్రోలియం రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని ఆయిలిండియా ఈడీ సలోమ యండో అన్నారు.

డెల్టాలకు 10,300 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 10,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3 వేలు, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,300 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.50 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

రాజమహేంద్రవరం సిటీ: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి భద్రాచలానికి ఏడు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ షేక్ షబ్నం శుక్రవారం తెలిపారు. 5వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుంచి ప్రతి గంటకు ఒక స్పెషల్ బస్సు నడిచేలా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తుల సౌకర్యార్థం వీటికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. సీతారాముల కల్యాణం అనంతరం భద్రాచలం నుంచి 6వ తేదీ ఒంటి గంట నుంచి తిరిగి రాజమహేంద్రవరానికి ప్రత్యేక బస్సులు వస్తాయన్నారు.

నేటి నుంచి రబీ ధాన్యం సేకరణ

జేసీ చిన్నరాముడు



రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలోని 216 రైతు సేవా కేంద్రాల్లో శనివారం నుంచి రబీ ధాన్యం సేకరణ ప్రారంభిస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కామన్ వెరైటీకి రూ.2,300, గ్రేడ్-ఎ రకానికి రూ.2,320 చొప్పున కనీస మద్దతు ధర చెల్లిస్తామన్నారు. హమాలీ, గోనెసంచులు, రవాణా చార్జీలను ప్రభుత్వం ద్వారా చెల్లిస్తామన్నారు. రైతుల సౌకర్యార్థం రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కోసం 216 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 216 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, 216 మంది హెల్పర్లను తాత్కాలికంగా నియమించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయమై సందేహాలు, ఫిర్యాదులకు కలెక్టరేట్‌లో 83094 87151 నంబరుతో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు. ఇది ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ అందుబాటులో ఉంటుందని జేసీ చిన్నరాముడు తెలిపారు.

స్లాట్ బుకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



శ్రీనివాస్‌కు దస్తావేజు అందిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ సత్యనారాయణ, సబ్ రిజిస్ట్రార్లు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో (ఒరిజినల్ బ్రాంచి) స్లాట్ బుకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ అన్నారు. కార్యాలయంలో స్లాట్ బుక్ చేసుకున్న కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన శుక్రవారం ప్రారంభించారు. రిజిస్ట్రేషన్ అనంతరం దస్తావేజులను రాష్ట్ర క్రెడాయ్ చైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్‌కు జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ, జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1, 2లు ఆర్.రాంబాబు, కె.పుల్లంరాజు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, స్లాట్ బుకింగ్‌ను పబ్లిక్ డేటా ఎంట్రీ విధానం ద్వారా, రిజిస్ట్రేషన్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా, క్యూఆర్ కోడ్ ద్వారా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ విధానం వలన కక్షిదారులు వేచి ఉండే సమయం, మధ్యవర్తుల ప్రభావం తగ్గుతాయని చెప్పారు. ప్రస్తుతం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రమే ఈ విధానం అమలు చేస్తున్నామని, దశలవారీగా మిగిలిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా అమలు చేస్తామని సత్యనారాయణ తెలిపారు. స్లాట్ బుకింగ్ ద్వారా తొలి రోజు 42 రిజిస్ట్రేషన్లు చేశామని జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 రాంబాబు తెలిపారు.

పెళ్లి పీటలు ఎక్కే వేళ.. మృత్యుఘాతం


గండేపల్లి/జగ్గంపేట: కొద్ది రోజుల్లో పెళ్లి.. నేడు పుట్టిన రోజు.. ఈ నేపథ్యంలో కొత్త దుస్తులు కొనుక్కుని.. ఎంతో ఆనందంగా తిరిగి వస్తున్న ఆ యువకుడిపై మృత్యువు కన్నెర్ర చేసింది. గండేపల్లి మండలం మల్లేపల్లికి చెందిన చిక్కాల కాటమస్వామి, సావిత్రి దంపతులకు కుమార్తె, కుమారుడు చిక్కాల శ్రీను (28) ఉన్నారు. కుమార్తెకు గతంలోనే వివాహం చేశారు. శ్రీను ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. తండ్రి కాటమస్వామి వ్యవసాయం చేస్తున్నారు. శ్రీనుకు గోకవరం మండలం మల్లవరానికి చెందిన అమ్మాయితో ఈ నెల 20న వివాహం చేయాలని నిశ్చయించారు. శనివారం శ్రీను పుట్టిన రోజు. ఈ నేపథ్యంలో పుట్టిన రోజు, పెళ్లి వేడుకలకు దుస్తులు కొనుగోలు చేసేందుకు స్నేహితుడితో కలిసి, శ్రీను మోటార్ సైకిల్‌పై శుక్రవారం పెద్దాపురం వెళ్లాడు. అక్కడ మిత్రులిద్దరూ కొత్త దుస్తులు కొనుకున్నారు. సాయంత్రం ఆనందంగా ఇంటికి తిరిగి వస్తుండగా, వారి బైక్‌ను జగ్గంపేట మండలం కాట్రావులపల్లి పెట్రోల్ బంకు వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీను (28) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మోటార్ సైకిల్‌పై ఉన్న స్నేహితుడు స్వల్పంగా గాయపడ్డాడు. పెళ్లి సమీపిస్తున్న వేళ.. పుట్టిన రోజుకు ఒక రోజు ముందు శ్రీను రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది.

నాగాంజలి మృతి బాధాకరం



నాగాంజలి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

- ఆమె ఆఖరి కోరిక ప్రకారం దీపక్‌కు కఠిన శిక్ష పడాలి
- ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటాం
- మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్



మీడియాతో మాట్లాడుతున్న భరత్‌రామ్

సాక్షి, రాజమహేంద్రవరం/కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి మృతి బాధాకరమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆమె మరణవార్త తెలుసుకుని పోస్టుమార్టం చేస్తున్న ప్రభుత్వాసుపత్రికి చేరుకున్న ఆయన శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, మృతురాలు సూసైడ్ నోట్‌లో ఏం కోరుకుందో దానిపై ఆమె తల్లిదండ్రులతో కలిసి పోరాటం చేస్తామన్నారు. దీపక్‌కు కఠిన శిక్ష పడాలని నాగాంజలి కోరుకుందని, అది నెరవేరే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీపక్ లాంటి కీచకులకు తగిన శిక్ష విధించడం ద్వారా ఇలాంటి ఘటనలు జరగకుండా చూడవచ్చన్నారు. నాగాంజలి కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం, కిమ్స్ ఆస్పత్రి యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని, ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. తానేదో రాజకీయం చేస్తున్నట్లు కొందరు పేర్కొనడం తగదని భరత్‌రామ్ పేర్కొన్నారు. విద్యార్థులు ధర్నా చేస్తున్నప్పుడు తాను కూడా వెళ్లానన్నారు. నాగాంజలి స్వయంగా ఇంజక్షన్ చేసుకుందా.. లేక ఎవరైనా చేశారా అనే అనుమానాస్పద ఘటన నేపథ్యంలో ఆ అమ్మాయికి తగిన న్యాయం జరిగే వరకూ అండగా ఉండాలని భావించామని వివరించారు. అప్పుడే విషయం బయటకు వచ్చిందని, లేకుంటే ఆ రోజు సాయంత్రమే చక్కబెట్టేసి ఉండేవారని అన్నారు. విషయం బయటకు వచ్చాకే దీపక్‌పై కఠిన సెక్షన్లు పెట్టారన్నారు. ఈ ఘటనపై హోం మంత్రి స్పందించకపోవడం, కనీసం ఒక ట్వీట్ కూడా చేయకపోవడం దారుణమన్నారు. దీనినిబట్టి కూటమి ప్రభుత్వం ఆడపిల్లలకు ఇచ్చే గౌరవమేమిటో అర్థమవుతోందని భరత్‌రామ్ అన్నారు.

వాటాల కోసం కయ్యం!

- టీడీపీ చేతుల్లోనే మట్టి, ఇసుక తవ్వకాలు
- మద్యం షాపులూ వారికే..
- వీటిలో తమ వాటా కోసం జనసేన, బీజేపీ పట్టు
- దీనికోసమే నిరసన స్వరాలని విమర్శలు



కొవ్వూరు: కూటమిలో భాగస్వామి పార్టీలుగా ఉన్నాం తప్ప.. మీ అవినీతిలో కాదంటూ కొవ్వూరు బీజేపీ, జనసేన నేతలు ఇటీవల అధికార టీడీపీపై ధ్వజమెత్తుతున్న విషయం తెలిసిందే. నియోజకవర్గంలో ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు, మద్యం విక్రయాల్లో దోపిడీకి.. తమ పార్టీలకు ఎటువంటి సంబంధమూ లేదని చెప్పుకునేందుకు ఆ రెండు పార్టీలూ ప్రయత్నిస్తున్నాయి. ఈ అక్రమాలపై చర్యలు తీసుకోవాలంటూ ఇటీవల బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యాన ఆ పార్టీ నేతలు ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చారు. ఇది జరిగిన కొద్ది రోజులకే జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీవీ రామారావు తాళ్లపూడి మండల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఎదుటే టీడీపీపై బహిరంగ విమర్శలు చేశారు. ఈ విభేదాల వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

విమర్శల వెనుక మర్మమిదీ..

అధికారాన్ని దక్కించుకునేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ కూటమిలోని జనసేన, బీజేపీ నేతలు ఈ విధంగా నాలుక మడత పెట్టడం వెనుక వేరే కథ ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక, మట్టి తవ్వకాలు, మద్యం వ్యాపారంలో పెత్తనం దాదాపు టీడీపీ చేతిలోనే ఉంది. ఇందులో వాటాల కోసమే కూటమి భాగస్వామ్య పార్టీలు ఈ విధంగా నిజాయితీ ముసుగు వేసి, కయ్యానికి దిగుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. పెత్తనమంతా టీడీపీ గుప్పెట్లోనే పెట్టుకుని, అడ్డగోలుగా సంపాదిస్తున్నారంటూ ఇరు పార్టీల నేతలూ విమర్శలకు దిగుతున్నారు. అక్రమార్జనలో తమకూ వాటా ఉండాలనే లక్ష్యంతోనే ఇలా బహిరంగ విమర్శలకు దిగుతున్నారని పలువురు చెప్పుకొంటున్నారు.

ర్యాంపులు, పదవుల్లో వాటాల కోసం..

నియోజకవర్గంలో జనసేనపై అధికార టీడీపీ సవతి తల్లి ప్రేమ చూపిస్తోందంటూ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు ఇటీవల విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో తాము భాగస్వామిగా ఉన్నప్పటికీ ప్రభుత్వ పరంగా తమ పార్టీకి లబ్ధి చేకూరడం లేదని ఆయన అంటున్నారు. కనీసం తమ పార్టీ నేతలు స్థానిక ఎమ్మెల్యేకి సమస్యలు విన్నవించుకుందామన్నా టీడీపీ కార్యాలయానికే వెళ్లాల్సి వస్తోందని, తీరా వెళ్తే అక్కడ సమస్యలు విన్నవించుకునే అవకాశం ఉండటం లేదని చెబుతున్నారు. ఇటీవల మట్టి, ఇసుక తవ్వకాలు, మద్యం విక్రయాల్లో కూటమి నేతల పాత్రపై మీడియాలో కథనాలు వచ్చాయి. వీటితో తమ పార్టీకి ఎటువంటి సంబంధమూ లేదంటూ తప్పించుకునేందుకు జనసేన ప్రయత్నిస్తోంది. వాస్తవానికి దేచెర్ల మట్టి తవ్వకాల్లో ఆ పార్టీ నేతలకూ వాటాలున్నాయనేది పబ్లిక్ టాక్. తాళ్లపూడి మండలంలో ఇసుక ర్యాంపుల కేటాయింపులో తమ వారికి టీడీపీ అన్యాయం చేస్తోందని రామారావు ఆరోపించారు. మరోవైపు ర్యాంపుల్లో తమ వాళ్లందరికీ భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తద్వారా కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో ర్యాంపులు దక్కించుకునేందుకు టీడీపీపై ఒత్తిడి తెస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే కొవ్వూరు ఎరినమ్మ ర్యాంపులో ఇప్పటికే కొంత మంది జనసేన నాయకులు పెత్తనం చేస్తున్నారు. ఇప్పుడు తాళ్లపూడి ర్యాంపుల్లో కూడా వాటా కోసమే ఈ విమర్శల ప్రహసనం నడుపుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అలాగే, కార్పొరేషన్, సొసైటీ పదవుల్లో తాము అడిగిందేమీ చేయడం లేదని ఆరోపిస్తున్నారు. తద్వారా నామినేటెడ్ పదవుల్లో వాటాల కోసం కూడా ఈ విమర్శల ఎత్తుగడ వేశారని పలువురు అంటున్నారు.

'కమలం' కస్సుబుస్సులు

మరోవైపు బీజేపీ నేతలు సైతం తమ పార్టీ నేతలకు ర్యాంపుల్లో ప్రాధాన్యం కల్పించడం లేదని టీడీపీపై కస్సుబుస్సుమంటున్నారు. ఎరినమ్మ ర్యాంపులో వాటాను ఒకరిద్దరు బీజేపీ నాయకులకు కూడా కేటాయించారు. మిగిలిన వారెవ్వరికీ అవకాశం దక్కడం లేదు. ఈ నేపథ్యంలోనే బీజేపీ నేతలు విమర్శలకు దిగుతున్నారని భావిస్తున్నారు. జనసేన, బీజేపీలు తమను బహిరంగంగానే టార్గెట్ చేస్తున్నా.. కూటమిలోని ప్రధాన భాగస్వామి టీడీపీ మాత్రం డోంట్ కేర్ అన్నట్లు వ్యవహరిస్తోంది. నామినేటెడ్ పదవుల భర్తీ అనంతరం కూటమి పార్టీల మధ్య విభేదాలు మరింత ముదురుపాకాన అవకాశాలున్నాయని చెబుతున్నారు.

విచిత్ర కళా ప్రదర్శన



ప్రదర్శనలో కానరాని జనం

- పేలవంగా ముగిసిన కార్యక్రమం
- తమకు ఒరిగిందేమీ లేదని చిత్రకారుల ఆవేదన




ప్రదర్శనను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘు రామ కృష్ణరాజు, మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): 'అమరావతి వీధి చిత్రకళా ప్రదర్శన' పేరిట సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో శుక్రవారం అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమం నగర వాసులను నిరాశకు గురి చేసింది. నగరంలోని జైలు రోడ్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశంలోని 500 మంది చిత్రకారులు పాల్గొంటారని, అనేక చిత్రాలు ప్రదర్శిస్తారని చెప్పారు. తీరా చూస్తే కూటమి నాయకుల అర్భాటమే కనిపించింది. చిత్రకారులను ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని కనీసం మూడు రోజులైనా నిర్వహించి ఉంటే నగర ప్రజలకు తెలిసి ఉండేది. కేవలం ఒక్క రోజు మాత్రమే నిర్వహించడంతో అసలు ఈ ప్రదర్శన ఉందనే విషయమే చాలా మందికి తెలియలేదు. దీంతో ఆశించిన స్థాయిలో జనం రాక ప్రదర్శన వెలవెలబోయింది. చివరకు స్కూల్ పిల్లలను తీసుకుని వచ్చి, మమ అనిపించారు. మధ్యాహ్నం నుంచి ఎండ వేడి, ఉక్కపోతతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం కాస్త చల్లబడిన తరువాత కొద్ది మంది ఈ చిత్ర కళా ప్రదర్శనను వీక్షించడానికి వచ్చారు. కొంతమంది మెహందీ పెట్టించుకొని వెళ్లిపోయారు. ఈ ప్రదర్శనలో ఆశించిన స్థాయిలో విక్రయాలు లేవని స్టాల్స్ వద్ద చిత్రాలు పెట్టిన చిత్రకారులు ఆవేదన చెందుతున్నారు. అనేక వ్యయ ప్రయాసలతో ఎక్కడెక్కడి నుంచో వచ్చామని, తీరా చూస్తే ఇక్కడ కొనుగోళ్లు నిరాశపరిచాయని చెప్పారు.

ట్రాఫిక్ మళ్లింపుతో ఇబ్బందులు

నగరంలోని సెంట్రల్ జైలు రోడ్డు చాలా రద్దీగా ఉంటుంది. ఇటువంటి రోడ్డుకు ఇరువైపులా చిత్ర కళా ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేశారు. దీనికోసం ఈ మార్గంలో వాహనాల రాకపోకలను నియంత్రించారు. లాలాచెరువు మీదుగా వచ్చే వాహనాలను లాలాచెరువు హైవే నుంచి మోరంపూడి సెంటర్ మీదుగా మళ్లించారు. అలాగే, కంబాల చెరువు నుంచి వచ్చే వాహనాలను కోరుకొండ రోడ్డు మీదుగా మళ్లించారు. దీంతో ప్రజలు నానా అవస్థలూ పడ్డారు. కార్యక్రమంలో శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాసు, బత్తుల బలరామకృష్ణ, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఇదో వి'చిత్రం?'



రఘురామకృష్ణరాజు కొనుగోలు చేసిన చిత్రమిదే

సీఎం చంద్రబాబు స్వయంగా గీశారంటూ చెబుతున్న ఓ చిత్రాన్ని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు రూ.1,01,116కు ఈ చిత్రకళా ప్రదర్శనలో కొనుగోలు చేయడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. చంద్రబాబు అత్యద్భుతంగా గీసినదంటూ బుద్ధుడి చిత్రపటాన్ని ఈ ప్రదర్శనలో ఉంచగా.. దానిని డిప్యూటీ స్పీకర్ కొనుగోలు చేశారు. వాస్తవానికి ఆ చిత్రాన్ని కర్నూలుకు చెందిన వేరే చిత్రకారుడు గీశాడు. దానిపై చంద్రబాబు సంతకం చేసినందుకుగానూ డిప్యూటీ స్పీకర్ రూ.లక్షకు పైగా వెచ్చించి కొనుగోలు చేయడం సందర్శకులను నివ్వెరపరచింది.

రక్తదానంపై అవగాహనకు సైకిల్ యాత్ర



సైకిల్‌పై యాత్ర చేస్తున్న బుజ్జిబాబు

తుని రూరల్: రక్తదానంపై యువతలో అవగాహన, చైతన్యం తీసుకువచ్చే లక్ష్యంతో సేవ్ బ్లడ్ పేరుతో తుని మండలం టి.తిమ్మాపురానికి చెందిన ఆకేటి బుజ్జిబాబు శుక్రవారం సాయంత్రం సైకిల్ యాత్ర చేపట్టాడు. తుని మండలం వి.కొత్తూరు సమీపంలోని పెట్రోల్ బంకులో రాత్రి బస చేశాడు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ, నాలుగు నెలల పాటు తన యాత్ర కొనసాగుతుందన్నారు. రక్తదానం వలన ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చని, దీనివలన ఎటువంటి నష్టమూ లేదని యువతకు అవగాహన కల్పించడమే తన యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ అవతరణకు ప్రధాన కారకుడైన పొట్టి శ్రీరాములు త్యాగాన్ని కూడా నేటి తరానికి తెలియజేస్తానన్నారు. పట్టణాలు, ప్రధాన గ్రామాల్లో తన యాత్ర కొనసాగుతుందని తెలిపారు. గతంలో బాలికలను, పక్షులను, మొక్కలను, జంతువులను రక్షించాలన్న నినాదంతో దేశంలోని 28 రాష్ట్రాల్లో 8 నెలల పాటు సైకిల్ యాత్ర చేశానన్నారు. అలాగే, కోల్‌కతాలో దాడికి గురైన మెడికో మోహితకు న్యాయం జరగాలని విజయవాడ నుంచి కోల్‌కతాకు 1,400 కిలోమీటర్ల పాదయాత్ర చేశానన్నారు. నేపాల్‌లో అన్నపూర్ణ బేస్ క్యాంపు నుంచి 4,130 మీటర్ల ఎత్తయిన శిఖరాన్ని అధిరోహించి, జాతీయ జెండాను ఎగురవేశానని బుజ్జిబాబు తెలిపారు.

హోటళ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించాలి

రాజమహేంద్రవరం సిటీ: పర్యాటకపరంగా జిల్లాలో హోటళ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించేందుకు ఆసక్తి ఉన్నవారిని గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జోనల్ స్పెషల్ అధికారి అజయ్ జైన్ అన్నారు. జిల్లా ప్రగతి, ప్రభుత్వ ప్రాధాన్యం కార్యక్రమాల అమలు, సమస్యలు, పరిష్కారం తదితర అంశాలపై శుక్రవారం ఇక్కడ నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరంతో పాటు జిల్లాలో 5 వేల హోటల్ రూములు అందుబాటులోకి తీసుకుని రావాలన్నారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 95523 00009పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. పీఎం సూర్యఘర్ పథకానికి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో 15.57 శాతం, హార్టికల్చర్ 16.33, పశు సంవర్ధక శాఖ 19.76, అటవీ రంగం 0.16, మత్స్య రంగం 2.92, తయారీ రంగం 7.93, వనరులు, నిర్మాణ రంగంలో 8.36 శాతం చొప్పున వృద్ధి రేటు సాధించేలా చర్యలు తీసుకోనున్నామని వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్ జైన్

ప్రలోభాల్లోనూ మోసాలేనా?

- ప్రలోభపెట్టే ఎంపీపీ ఎన్నికలో గెలిచారు
- కూటమి నేతల తీరుపై అనపర్తి మాజీ ఎమ్మెల్యే ధ్వజం



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ఇటీవల జరిగిన బిక్కవోలు ఎంపీపీ ఎన్నికల్లో కూటమి నాయకులు తమ ఎంపీటీసీ సభ్యులను ప్రలోభపెట్టడమే కాకుండా, ఆ సమయంలో వారికి ఇచ్చిన హామీల అమలులోనూ మోసాలకు పాల్పడ్డారని వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆరోపించారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కొంత మంది ఎంపీటీసీ సభ్యులను కూటమి నాయకులు ఏవిధంగా ప్రలోభపెట్టారో, మోసాలు, బెదిరింపులకు పాల్పడ్డారో వివరించారు. దీనిపై ఆ ఎంపీటీసీ సభ్యుల్లో కొందరు ఇటీవల వారి సన్నిహితుల వద్ద వాపోయారన్నారు. వైఎస్సార్ సీపీకి వ్యతిరేకంగా ఓటు వేస్తే రూ.1.50 లక్షలు ఇస్తామని ఒక ఎంపీటీసీ సభ్యుడిని ఆశ చూపించి, రూ.1.25 లక్షలు మాత్రమే చేతిలో పెట్టారని సూర్యనారాయణరెడ్డి అన్నారు. మరో ఎంపీటీసీ సభ్యుడు తమ గ్రామంలో సుమారు 30 ఏళ్లుగా ఒక దేవస్థానం భూమిలో పశువుల పాక వేసుకుని, పశుపోషణ చేసుకుంటూంటే.. వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఓటు వేస్తే ఆ పాకను తొలగిస్తామంటూ బెదిరించారని తెలిపారు. స్వగ్రామంలో ఎరువుల వ్యాపారం చేసుకుంటున్న మరో ఎంపీటీసీ సభ్యుడిని వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఓటు వేస్తే ఆ షాపుపై విజిలెన్స్, వ్యవసాయ అధికారులతో దాడులు చేయిస్తామంటూ బెదిరించారని ఆరోపించారు. మరో ఎంపీటీసీ సభ్యుడు తన గ్రామంలో సప్లయి కంపెనీ నిర్వహించుకుంటున్నారని, వైఎస్సార్ సీపీకి ఓటు వేస్తే ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాలకు ఆ సప్లయి కంపెనీకి ఆర్డర్ ఇవ్వబోమంటూ బెదిరించారని చెప్పారు. అలాగే, వాహనంలో గంజాయి పెట్టి కేసులు బుక్ చేస్తామంటూ మరో ఎంపీటీసీ సభ్యుడిని బెదిరించారంటూ తెలిపారు. మరో ఎంపీటీసీ సభ్యుడు ఎంపీడీఓ కార్యాలయం నుంచి వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యుల గుర్తింపు కార్డులను అధికారుల అంగీకారంతో తీసుకుంటే, ఆయనపై కూడా అధికారులను ఉపయోగించి తప్పుడు కేసు పెట్టి, ఓటింగ్‌కు వెళ్లకుండా చేస్తామంటూ స్థానిక పోలీస్ అధికారులను ఉపయోగించి భయపెట్టారని చెప్పారు. ఇలా ప్రలోభాలు, బెదిరింపులు, మోసాలతో ఎంపీపీ పదవి గెలిచారని దుయ్యబట్టారు. ఈ గెలుపును ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన గొప్పగా చెప్పుకుంటున్నారని, ఇది వైఎస్సార్ సీపీ కక్కిన కూడుకు కూటమి నాయకులు కక్కుర్తి పడినట్లు కాదా అంటూ విమర్శించారు. వైఎస్సార్ సీపీకి పుట్టిన బిడ్డను బీజేపీ బిడ్డగా చెప్పుకోడానికి సిగ్గనిపించడం లేదా అని మండిపడ్డారు. తాను సామెత కూడా సరిగా పలకలేకపోయానంటూ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి విమర్శించారని, అవసరమైతే తాను మాట్లాడిన ఆ వీడియో మరోసారి చూసి, వినాలని అన్నారు. ఎవరికో పుట్టిన బిడ్డను మీ బిడ్డగా చెప్పుకున్నట్లు కాదా అనే సామెతను తాను స్పష్టంగానే పలికానని, గతంలో రామకృష్ణారెడ్డి రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పేరును కూడా సరిగ్గా పలకలేకపోయిన విషయం మరచి, తనపై వ్యంగ్యంగా మాట్లాడటం సరికాదని సూర్యనారాయణరెడ్డి అన్నారు.

క్లుప్తంగా

బూరుగుపూడిలో చోరీ

రూ.45,000 నగదు, 2 కాసుల బంగారం, 200 గ్రాముల వెండి ఆభరణాల తస్కరణ


ఇంట్లో చెల్లాచెదురుగా పడివున్న వస్తువులు

మధురపూడి: తాళాలు వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి నగదు, నగలు చోరీ చేసిన ఘటన కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండా నాగ భూషణం కుటుంబ సమేతంగా బంధువుల ఇంటికి పెళ్లికి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం ఇంటికొచ్చారు. ఇంట్లో సామాన్లు చిందర వందరగా పడి ఉండటం, తలుపుల తాళాలు పగిలి ఉండటం, గదిలో బద్దలయిన బీరువాను, దాని సొరుగులు మంచంపై పడి ఉన్నట్టు గుర్తించారు. దానిలోని రూ.45,000 నగదు, 2 కాసుల బంగారం, 200 గ్రాముల వెండి ఆభరణాలు, హాలులోని పెద్ద ఎల్ఈడీ టీవీ చోరీ అయినట్టు గుర్తించారు. దీంతో కోరుకొండ పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఎస్సై శ్యామ్సుందర్ ఆధ్వర్యంలో పరిశీలించారు. క్లూస్ టీమ్ చోరీ జరిగిన ప్రదేశంలో వేలిముద్రలను సేకరించింది. ఎస్సై శ్యామ్సుందర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

రాములోరి పెళ్లి సందడి

- కోదండరాముని కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి
- ఆంధ్రా భద్రాద్రి జి.మామిడాడలో రేపు నిర్వహణ

పెదపూడి: కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడలోని శ్రీ కోదండరాముడి కల్యాణ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. కోరిన కోర్కెలు తీర్చే కోదండరాముడిగా భక్తులు ఆయనను కొలుస్తారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలంలోని భద్రాది రాముడి ఆలయానికి దీటుగా ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆంధ్రా భద్రాద్రిగా పేరుగాంచిన ఈ ఆలయంలో తూర్పు, పశ్చిమ దిశల్లో నిర్మించిన గోపురాలు అత్యంత ఎత్తుగా ఉంటాయి.


ప్రత్యేక అలంకరణలో కొలువైన సీతారాముల వారు


ఆకట్టుకునే అద్దాల మందిరం

కల్యాణ కొబ్బరి బొండాలు, రామనామ తలంబ్రాలు సిద్ధం


ద్వారంపూడి యువరాజారెడ్డి

జి.మామిడాడ గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు ద్వారంపూడి యువరాజారెడ్డి అనే సూక్ష్మ కళాకారుడు కోదండ రామాలయంలో ఆదివారం జరిగే సీతారాముల కల్యాణానికి ప్రత్యేకంగా తయారు చేసిన కొబ్బరి బొండాలు, బియ్యపు గింజలపై మూడు భాషల్లో రాసిన రామ నామ తలంబ్రాలు సిద్ధం చేశారు.

ఆయన మాట్లాడుతూ కల్యాణ కొబ్బరి బొండాలపై శంఖు, చక్ర, నామాలతో కోదండరాముని సీతా, లక్ష్మణ, ఆంజనేయ సహితంగా బొండాలపై రంగురంగుల పాడులు, ముత్యాలు, లేసులు సహాయంతో సుందరంగా తీర్చిదిద్దినట్టు చెప్పారు. బియ్యపు గింజలపై ఎలాంటి సూక్ష్మ పరికరాలు వినియోగించకుండా భక్తి శ్రద్ధలతో పార్కర్ పెన్ను సహాయంతో నిష్టగా 1,00,116 గింజలపై తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషల్లో రాసి సమర్పిస్తున్నట్టు తెలిపారు. 15 ఏళ్లగా బియ్యపు గింజలపై ఈ మూడు భాషల్లో రాస్తున్నానన్నారు. ఈ


శంఖు,చక్ర, సీతా,రామ నామాలతో సుందరంగా ఉన్న కల్యాణ కొబ్బరి బొండాలు


రామనామాలు రాసిన బియ్యపు గింజలు

తలంబ్రాలను స్వామి వారి కల్యాణ క్రతువులో సమర్పించనున్నట్లు తెలిపారు. ముక్కోటి ఏకాదశికి ప్రారంభమైన ఈ కార్యక్రమం శ్రీరామనవమి రోజుతో పూర్తవుతుందన్నారు.

వాటిపై శిల్పాలను భాగవత, రామాయణాల్లోని అపురూప ఘట్టాలతో మనోహరంగా తీర్చిదిద్దారు. అవి భక్తులను ఆకట్టుకుంటాయి. గొల్లల మామిడాడలో శ్రీ కోదండ రామాలయం కల్యాణ కాంతులను సంతరించుకుంది. ఆదివారం జరిగే సీతారాముల కల్యాణానికి భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. వేల సంఖ్యలో వచ్చే భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక్కడ మంచి ముత్యాలను తలంబ్రాలుగా వాడటం విశేషం.


జి.మామిడాడలో కోదండరామాలయం తూర్పు, పశ్చిమ గోపురాలు

కల్యాణోత్సవ కార్యక్రమాలు వివరాలివీ..

- 6వ తేదీ మధ్యాహ్నం అభిజిత్ లఘ్నంలో స్వామివారి కల్యాణం
- 7వ తేదీ సుప్రభాత సేవ, నిత్యోపాసన, డోలు సన్నాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు
- 8వ తేదీ సుప్రభాత సేవ, నిత్యోపాసన, సహస్రనామార్చన, మధ్యాహ్నం 3.30 గంటలకు సదస్యం
- 9వ తేదీ ఉదయం శేష వాహనంపై స్వామివారి గ్రామోత్సవం
- 10వ తేదీ ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, కంకణ విసర్జనం, పూర్ణాహుతి, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు
- 11 వ తేది అద్దాల శయన మందిరంలో రాత్రికి ఊయల సేవ, శ్రీ పుష్పయాగం కార్యక్రమాలతో కల్యాణోత్సవాలు ముగిస్తాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- అన్నయ్య దిన కార్యక్రమానికి వెళుతుండగా దుర్ఘటన


గంగలకుర్రులో రోడ్డు ప్రమాద దృశ్యం

అంబాజీపేట: అతి వేగంగా వచ్చిన లారీ ఓ వ్యక్తి నిండుప్రాణాన్ని బలితీసుకుంది. అన్నయ్య దిన కార్యక్రమాన్ని ముగించేందుకు స్కూటీపై కౌశికకు వెళుతున్న ఇద్దరు అన్నదమ్ములను లారీ ఢీ కొట్టింది. అందులో ఒకరు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందగా, మరొకరు చికిత్స పొందుతూ మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంగలకుర్రులో ఈ గత నెల 24న మృతి చెందిన మంగిపూడి సూర్యనారాయణ దిన కార్యక్రమాన్ని మంగిపూడి నాగరాజు, అతని సోదరుడు రామచంద్రరావుల ఇంటి వద్ద నిర్వహించారు. అనంతరం ఆ కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు నాగరాజు (64), రామచంద్రరావు (68)స్కూటీపై స్థానికంగా ఉన్న కౌశిక నదికి వెళుతున్నారు. గంగలకుర్రు ప్రాథమిక పాఠశాల సమీపంలో నాలుగు రోడ్ల సెంటర్ వద్దకు వచ్చేసరికి ముక్కామల నుంచి అంబాజీపేట వైపు అతివేగంగా వెళుతున్న లారీ వీరిని బలంగా ఢీ కొట్టింది. దాంతో నాగరాజు, రామచంద్రరావులను 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలో నాగరాజు మృతి చెందగా, రామచంద్రరావు చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై కె.చిరంజీవి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. లారీ డ్రైవర్ పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడని ఎస్సై చెప్పారు. అప్పటి వరకు అన్న దిన కార్యక్రమాన్ని పూర్తి చేసిన అతని సోదరులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడం బంధువులు, స్థానికులను కలచివేసింది. అప్పటికే అన్నదమ్ముల్లో ఒకరిని కోల్పోయి శోకసముద్రంలో ఉన్న మంగిపూడి కుటుంబ సభ్యులు మరో ఇద్దరు మృత్యువాత పడ్డారన్న దుర్వార్త వినడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు.

సీతమ్మకు కోవా సారె సిద్ధం


కోవాతో తయారు చేసిన వివిధ రకాల స్వీట్లు


కోవాతో స్వీట్లు చేస్తున్న మహిళలు

పి.గన్నవరం: స్థానిక శ్రీపట్టాభి రామస్వామి వారి ఆలయంలో ఆదివారం జరుగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాలకు ఆలయ ధర్మకర్తలు పేరిచర్ల భీమరాజు, సత్యవాణి దంపతులు కోవా స్వీట్లతో తయారు చేయిస్తున్న కంత (సారె) భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో శ్రీరాముని తరపున సీతమ్మవారికి ఈ కంతను సమర్పిస్తారు. వివిధ రకాల ఫలాలు, పుష్పాలు, కూరగాయలు, పంచె, చీర, పర్ణశాల వంటి ఆకృతుల్లో కోవాతో తయారు చేస్తున్న స్వీట్లు భక్తులకు కనువిందు చేస్తున్నాయి. గత 16 ఏళ్ల నుంచి ఈ ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. ఏటా కోవాతో పాటు పలు రకాల పిండి వంటలను తయారు చేయించి సీతమ్మవారికి సమర్పిస్తున్నట్టు సత్యవాణి తెలిపారు. స్థానిక అక్విడెక్టు వద్ద వేంచేసిన శ్రీపట్టాభిరామ స్వామి వారి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా వైభవంగా కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. దీనికి 20 రోజుల ముందు నుంచి 100 రకాలకు పైగా కోవాతో స్వీట్లు, పిండి వంటలు తయారు చేయిస్తారు. స్వీట్లు, పిండి వంటల తయారీలో స్థానిక శ్రీరామ్ గార్డెన్స్కు చెందిన మహిళా భక్తులు సహకారం అందిస్తున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

మద్యం తాగిన దేవస్థానం ట్రాన్స్పోర్టు డ్రైవర్

విధుల నుంచి తొలగించిన అధికారులు

అన్నవరం: అన్నవరం దేవస్థానం ట్రాన్స్పోర్టులో ఔట్సోర్సింగ్ డ్రైవర్గా పనిచేస్తున్న పి.వినోద్కుమార్ మద్యం తాగి వాహనం నడుపుతున్నట్టు బ్రీత్ అనలైజర్ పరీక్షలో తేలడంతో అతనిని విధుల నుంచి తొలగించారు. తదుపరి చర్యల కోసం ఈఓకు నివేదిక సమర్పించినట్టు దేవస్థానం సూపరింటెండెంట్ ఐవీ రామారావు శుక్రవారం తెలిపారు. సత్యదేవుని తొలిపావంచా వద్ద నిర్వహించిన తనిఖీలలో ఒక వ్యక్తి మంచినీటి సీసాలో మద్యం కలిగిఉన్న విషయం బయటపడింది. వెంటనే ఆ మద్యాన్ని స్వాధీనం చేసుకొని పారబోశారు. ఆ వ్యక్తిని వెనక్కి పంపించేసినట్లు తెలిపారు.

పెట్రోలియం రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతం

ఆయిల్ ఇండియా లిమిటెడ్ ఈడీ డైరెక్టర్ సలోమ యండో


జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న అతిథులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పెట్రోలియం రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని ఆయిల్ ఇండియా లిమిటెడ్ ఈడీ సలోమ యండో పేర్కొన్నారు. జేఎన్టీయూకే ప్రాంగణంలో శుక్రవారం ఉదయం అలూమ్ని ఆడిటోరియంలో ఫిపి స్టూడెంట్ చాప్టర్స్ 13వ వార్షిక సమావేశం నిర్వహించారు. యూసీఈకే కెమికల్ ఇంజినీరింగ్, పెట్రోలియం ఇంజినీరింగ్ విభాగాలలోని జేఎన్టీయూకే ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పెట్రోలియం ఇండస్ట్రీ (ఫిపి) స్టూడెంట్ ఛాప్టర్ ఆధ్వర్యంలో ఇది జరిగింది. జేఎన్టీయూకే ఫిపి స్టూడెంట్ చాప్టర్ ఫ్యాకల్టీ అడ్వయిజర్ ప్రొఫెసర్ కేవీ రావు అధ్యక్షత వహించగా ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, ఫిపి డైరెక్టర్ (అన్వేషణ ూఉత్పత్తి) దేబ్ జ్యోతి వెలిగించారు. ముఖ్యఅతిథి శ్రీ సలోమ యాండో మాట్లాడుతూ సహజ వనరుల రంగంలో భారత ప్రభుత్వం నిర్దేశించిన నికర జీరో లక్ష్యాలను సాధించడానికి సంబంధిత సంస్థలు తీసుకుంటున్న వివిధ కార్యక్రమాలను పవర్పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. భారతదేశం చమురు వినియోగంలో 3వ స్థానంలో ఉందని, ప్రపంచవ్యాప్తంగా 13.2 బిఓఈ (బ్యారెల్ ఆఫ్ ఈక్వివాలెంట్) వినియోగిస్తుండగా మన దేశంలో 4.7 బిఓఈ వినియోగిస్తున్నామన్నారు. భారతదేశంలో 26 అవక్షేపణా బేసిన్లు ఉండగా మొత్తం 3.36 మిలియన్ల చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో వ్యాపించి ఉన్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని త్వరలో చమురు నిక్షేపాల అన్వేషణ, అభివృద్ధిపై రోడ్మ్యాప్ సిద్ధం చేస్తున్నామన్నారు. దేశంలోని విద్యాసంస్థలతో కలిసి సంయుక్తంగా ఎనర్జీ ఇనీషియేటివ్ ప్రోగ్రామ్స్ను చేపట్టనున్నామన్నారు.

నూతన ఆవిష్కరణలు అవసరం

ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ కెమికల్, పెట్రోలియం ఇంజినీరింగ్ విద్యార్థులు ఇంధన వనరుల ఉత్పత్తి రంగంలోకి రానున్న నేపథ్యంలో రాష్ట్ర, దేశ అవసరాల మేరకు ఇంధన వనరులను ఉత్పత్తి చేసేలా నూతన ఆవిష్కరణలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కాలుష్య రహితమైన ఇంధన వనరులను అందించాల్సిన బాధ్యత పీఈసీఈ విద్యార్థులపై ఉందన్నారు. ఫిపి డైరెక్టర్ దేబ్ అధికారి మాట్లాడుతూ విద్యార్థులను ఇంధన రంగంలో భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దడమే ఫిపి ప్రధాన లక్ష్యమన్నారు. సహజ వనరుల రంగంలో డ్రిల్లింగ్ మరియు అన్వేషణలో ఖచ్చితత్వం అనేది చాలా ముఖ్యమని, దీన్ని దష్టిలో పెట్టుకుని ఫిపి స్టూడెంట్ చాప్టర్ల ద్వారా ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. దేశంలోని 11 విద్యాసంస్థల నుంచి వచ్చిన ఫిపి స్టూడెంట్ చాప్టర్ల ప్రతినిధులకు అతిథులు ఫిపి ఫ్లాగ్, బ్యాడ్జ్ను అందజేసి అభినందించారు. ఫిపి 13వ వార్షిక సమావేశంలో భాగంగా 'భారతదేశంలో అధిక శక్తి సామర్థ్యం, కచ్చితత్వంతో హైడ్రోకార్బన్ల అన్వేషణను వేగవంతం చేయడం' అనే నినాదంపై స్టూడెంట్ చాప్టర్లకు నిర్వహించిన పోటీలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నీరజ్ సిన్హా, ఓఎన్జీసీ ఈస్టర్న్ ఆఫ్షోర్ అసెట్ ఈడీ అసెట్ మేనేజర్ రత్నేష్ కుమార్, ఓఎన్జీసీ కావేరీ బేసిన్ మేనేజర్ూఈడీ శంతను ముఖర్జీలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. తదుపరి పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన స్టూడెంట్ చాప్టర్లకు అతిథులు బహుమతులను ప్రదానం చేయడంతో పాటు విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. జేఎన్టీయూకే డైరెక్టర్లు ప్రొఫెసర్ బి.బాలకృష్ణ, ఏ.స్వర్ణకుమారి, యూసీఈకే ప్రిన్సిపాల్ ఎస్.మోహన్రావు, అక్నూ మాజీ ఉపకులపతి కె.పద్మరాజు, కెమికల్, పెట్రోలియం ఇంజినీరింగ్ విభాగాధిపతులు, అధ్యాపకులు, దేశంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన ఫిపి స్టూడెంట్ చాప్టర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

మేమంతా శివరామ సుబ్రహ్మణ్యం వెంటే..

స్పష్టం చేసిన ఆర్యవైశ్య సంఘం నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న శివరామ సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆర్యవైశ్యులంతా ఏపీఐఐసీ మాజీ చైర్మన్, వైశ్య ప్రముఖుడు శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం వెంటే ఉంటామని వైశ్య సంఘం నాయకులంతా స్పష్టం చేశారు .తామంతా రాజకీయ పార్టీల జెండాలతో రాలేదని, వైశ్యుల అజెండాతో మాత్రమే వచ్చామని స్పష్టం చేశారు. శుక్రవారం లాలాచెరువులోని వైశ్య హాస్టల్లో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రగళ్ళపాటి కనకరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రాజకీయాలతో సంబంధం లేకుండా శివరామ సుబ్రహ్మణ్యంను పెద్దగా ఉంచి సేవా కార్యక్రమాలు చేస్తూ ఏ సమస్య వచ్చినా వాటిని పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నామన్నారు. కోనసీమ జిల్లా విడదీసినప్పుడు రాష్ట్ర మహాసభ బైలాకు విరుద్ధంగా కమిటీ ఏర్పాటు వలన ప్రయోజనం లేదన్నారు. ప్రజలు సేవచేసే వ్యక్తులను గుర్తిస్తారని అన్నారు. శివరామసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలో అందరికీ వైశ్య హాస్టల్ ఒక షెల్టర్ కావాలనే ఉద్దేశంతో ఒక ఫ్లోరు అందిస్తున్నట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో ఆతిథ్యానికి మారుపేరుగా ఉన్నవారిని విడదీయడం సబబు కాదన్నారు. తనను టార్గెట్ చేయాలని చూస్తున్నారని, తనవల్ల ఎవరూ మోసపోలేదని స్పష్టం చేశారు. తాను చెప్పిందే జరగాలని అనుకోనని, ఎవరు చెప్పినా వింటానన్నారు. రాష్ట్ర మహాసభ ఒకే నాయకత్వం కింద ఉండాలని భావిస్తానని, కాని రాష్ట్ర బైలాను పక్కన పెట్టి నియామకాలు చేపట్టడం కరెక్టో కాదో వారే ఆలోచించుకోవాలన్నారు. పెద్దలముందు చేసిన ప్రమాణాల ప్రకారం నడుచుకుంటే సమాజంలో కాని , సంఘంలో కాని గౌరవం ఉంటుందని శివరామ సుబ్రహ్మణ్యం హితవు పలికారు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబీ, కార్యదర్శి కుసుమంచి పాపారావు, కోశాధికారి కంచర్ల కృష్ణ మోహన్, నంబూరి రెడ్డియ్య, పల్లపోతు బంగారం, కోరుప్రోలు వెంకటేశ్వరరావు, అత్తలూరి సాయిబాబా, కుసుమంచి సుబ్బరాయులు రాజమండ్రి చాంబర్ అధ్యక్షుడు తవ్వా రాజా పాల్గొన్నారు.

గర్భిణి కిడ్నాప్ కథ సుఖాంతం

- 9 నెలలు గుడ్డలు పెట్టుకుని గర్భం దాల్చినట్టు నటన
- గొడ్రాలు అనే మాట పడలేకే ఈ నాటకం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో కలకలం సృష్టించిన గర్భిణి కొప్పిశెట్టి సంధ్యారాణి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయం శుక్రవారం విడుదల చేసింది. దేవీపట్నం మండలం ఇందుకూరిపేటకు చెందిన కొప్పిశెట్టి సంధ్యారాణి 9 నెలల గర్భిణి కావడంతో ఆమె భర్త రాజమహేంద్రవరంలోని జయ కిడ్నీకేర్ ఆసుపత్రికి గురువారం పురిటికి తీసుకువచ్చాడు. ఆసుపత్రిలో ఆమెకు ఓపీ చీటీ రాశారు. డాక్టర్ చూసేలోగా ఆమె రెండుసార్లు బయటకు వచ్చింది. అలా మూడోసారి బయటకు వచ్చి కనిపించకుండా పోయింది. దీంతో కంగారుపడిన సంధ్యారాణి భర్త విషయాన్ని త్రీటౌన్ పోలీసులకు తెలిపాడు. త్రీటౌన్ సీఐ వి.అప్పారావు పర్యవేక్షణలో ఎస్సై షేక్సుభానీ, మరికొంత మంది పోలీసులు రెండు టీములుగా విడిపోయి ఆచూకీ కోసం గాలించారు. పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. సంధ్యారాణి ఫోన్ ఆధారంగా కాకినాడలో ఆమె ఉన్నట్లు తెలుసుకున్నారు. అక్కడ బస్టాండ్లో ఆమెను పట్టుకున్నారు. పోలీసులు ఆమెను ప్రశ్నించగా...తనను ఎవరో కిడ్నాప్ చేశారని, తనకు ఇద్దరు కవల పిల్లలు పుట్టారని, ప్రసవం అయిన వెంటనే పిల్లను ఎవరో ఎత్తుకెళ్లిపోయారని, పలు రకాలుగా పోలీసులకు తెలిపింది. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు ఆమెను కాకినాడ జీజీహెచ్కు తరలించారు.

9 నెలలు గుడ్డలు పెట్టుకుని గర్భిణిగా..

కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో దుర్గను పరిశీలించిన వైద్యులు ఆమె గర్భిణి కాదని తేల్చి చెప్పారు. దీంతో హతాశులయిన పోలీసులు తేరుకుని ఆమె ఈ నాటకం ఆడడానికి గల కారణాలను తెలుసుకున్నారు. దుర్గకు పెళ్లి అయి తొమ్మిది సంవత్సరా లు అయ్యింది. ఆమెకు పిల్లలు లేరు. దీంతో ఆమె బయటి వారు, ఇంటిలో కుటుంబ సభ్యులు ఆమెను గొడ్రాలుగా చూస్తున్నారు అనే భావనంతో తనకు కడుపు వచ్చినట్లు నాటకమాడింది. ఈ తొమ్మిది నెలలు చాలా జాగ్రత్తగా ఉండాలని, భార్యాభర్తలు చాలా దూరంగా ఉండాలని తెలిపింది.

సంధ్యారాణి డాక్టర్ దగ్గరకు వచ్చి లోపలికి వెళ్లినప్పుడు తనకు గర్భం ఎందుకు రావడంలేదని మాత్రమే అడిగి బయటకు వచ్చేసేది. బయట భర్తను కూర్చోపెట్టి ఆ సమయంలో ఆమె ఒక్కతే డాక్టర్ వద్దకు వెళ్లేది. డాక్టర్ అంతా బావుందని, పురుడు వచ్చే వరకు చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్పారని తెలిపేది. దీంతో దుర్గ భర్త నిజమని నమ్మి ఆమెను కంటికి రెప్పలా చూసుకోసాగాడు. ఆమె కడుపు రోజురోజుకీ పెరుగుతున్నట్లు గుడ్డలు పెట్టుకుని కాలం వెళ్లదీసింది. చివరికి ఆ తంతు బయటపడడంతో ఆమె పరిస్థితిపై జాలి పడడం పోలీసులవంతైంది. పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసును వేగంగా ఛేదించిన త్రీటౌన్ సీఐ వర్రే అప్పారావు, ఎస్సై షేక్సుభానీ, పోలీసు సిబ్బందిని ఎస్పీ డి.నరసింహాకిశోర్ అభినందించారు.

గోదావరిలో పడి ఏడో తరగతి విద్యార్థి మృతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): గోదావరి నదిలో పడి మెసా గనిపోతురాజు (12) అనే విద్యార్థి శుక్రవారం మృతిచెందాడు. తాడితోట శారదానగర్కు చెందిన గనిపోతురాజు డీఎంహెచ్ స్కూలులో ఏడో తరగతి చదువుతున్నాడు. ఉదయం యథావిధిగా స్కూలుకు వెళ్లాడు. మధ్యాహ్నం నుంచి స్నేహితులతో కలిసి పుష్కర్ఘాట్కు వెళ్లాడు. అక్కడ గోదావరి నదిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ మునిగి చనిపోయాడు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. విద్యార్థిని తండ్రి బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.